


బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707



తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT






సంపుటి: 1 | సంచిక: 142 | పేజీలు: 4 | ఎడిటర్ : బక్క రవీందర్ | ప్రచురణ: హైదరాబాద్ | గురువారం 26 -12-2024 | వెల: 5/రూ -




## జననేతకు నీరా'జనం'

వైఎస్సార్ జిల్లా తాతిరెడ్డిపల్లెలో భారీ జనసందోహానికి అభివాదం చేస్తున్న వైఎస్ జగన్

- అభిమాన నేతను చూసేందుకు తరలివచ్చిన పల్లె ప్రజానీకం
- తాతిరెడ్డిపల్లె రామాలయం విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న వైఎస్ జగన్
- దారి పొడవునా రోడ్డుపైకి ఊళ్లకు ఊళ్లు తరలి వచ్చిన వైనం
- 30 కిలోమీటర్ల ప్రయాణానికి ఏకంగా 6 గంటల సమయం
- అనారోగ్యంతో ఉన్న అనుచరులకు ఆత్మీయ పలకరింపు
- కుటుంబ సభ్యులతో కలిసి పులివెందుల సీఎస్ఐ చర్చిలో ప్రార్థనలు
- కుటుంబ సభ్యులతో కలిసి కేట్ కట్ చేసిన మాజీ సీఎం

2లో

## ఆయన ఆదేశాలతోనే

# నిధుల మళ్లింపు

### సీనియర్ ఐఏఎస్ దానకిశోర్ వాంగ్మూలం!

### ఫార్ములా-ఈ రేసు కేసులో కీలక పరిణామం

- నాలుగు గంటల పాటు ప్రశ్నించిన ఏసీబీ
- పలు అంశాలకు సంబంధించి ఆధారాల సేకరణ
- అరెస్టు వద్దంటూ ప్రభుత్వానికి అర్వింద్ వినతులు
- అప్రూవర్‌గా మార్చుకునే యోచనలో ఏసీబీ
- ఆయన విచారణ తర్వాత కేటీఆర్‌కు నోటీసులు
- కోర్టు తదుపరి ఉత్తర్వుల అనంతరమే?



ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాతపూర్వక ఫిర్యాదు ఇచ్చిన ఐఏఎస్ అధికారి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు రికార్డు చేశారు.

హైదరాబాద్: ఫార్ములా-ఈ కారు రేసు కేసులో కేటీఆర్‌కు ఉచ్చు బిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కేసు దర్యాప్తులో కీలక పరిణామం చోటుచేసుకుంది. రాతపూర్వక ఫిర్యాదు ఇచ్చిన ఐఏఎస్ అధికారి దానకిశోర్ వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు రికార్డు చేశారు. ఏసీబీకి చెందిన సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) బృందం దానకిశోర్ నుంచి కీలక ఆధారాలు సేకరించింది.



## సీఎం రేవంత్‌రెడ్డితో సినీ ప్రముఖుల భేటీపై దిల్ రాజు ప్రకటన

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని డిసెంబర్ 26న చిత్ర పరిశ్రమలోని పలువురు ప్రముఖులతో పాటు కలవబోతున్నట్లు ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు ప్రకటించారు. కిమ్స్ ఆసుపత్రిలో

2లో

## ఆడారి చేరికపై కూటమిలో చిచ్చు!

- బహిరంగంగానే స్పీకర్ అయ్యన్న అసహనం
- తెలిసీ ఎందుకు చేశారోనన్న చంద్రబాబు





# ప్రత్యేక సాయంతో ఆదుకోండి

### మోదీకి సీఎం చంద్రబాబు విజ్ఞప్తి.. ఏపీ విజన్ డాక్యుమెంట్ ప్రధానికి అందజేత

### ఐదేళ్ల రెవెన్యూ లోటు గ్రాంటును.. జగన్ సర్కారు మూడేళ్లలోనే వాడేసింది

- 94 కేంద్ర పథకాల నిధులు దారి మళ్లించారు
- మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ముడి ఖనిజం ఇవ్వండి
- సీఎం విన్నపాలు.. పోలవరం, అమరావతికి
- నిధులిచ్చినందుకు ప్రధానికి ధన్యవాదాలు
- వచ్చే నెలలో మోదీ రాష్ట్ర పర్యటనపై చర్చ
- అమిత్‌షా, నిర్మల, నడ్డా, కుమారస్వామి, అశ్వినీ వైష్ణవ్‌తో వేర్వేరుగా భేటీ

న్యూఢిల్లీ: స్వర్ణాంధ్ర విజన్-2047ను సాకారం చేసేందుకు అన్ని విధాలా సాయం అందించాలని ప్రధాని మోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు. గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసిందన్నారు. ఐదేళ్లలో రావలసిన రెవెన్యూ లోటు గ్రాంటును మూడేళ్లలోనే వాడేసిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్రానికి ప్రత్యేకంగా ఆర్థిక సాయం అందించాలని అభ్యర్థించారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా... తమ వంతుగా రాష్ట్రప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను, వాటిని చేరుకునేందుకు సిద్ధం చేసిన ప్రణాళికలను, ఆలోచనలను ప్రధానికివివరించారు.

2లో

## జీవితాంతం అంబేడ్కర్‌ను అవమానించారు

- కాంగ్రెస్‌పై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ధ్వజం
- బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి శతజయంతి ఉత్సవం




2లో

హైదరాబాద్: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్‌ను జీవితాంతం అవమానించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి దుయ్యబట్టారు.

## సాగు రైతుకే 'భరోసా'!

- రైతు భరోసా పథకంపై కేబినెట్ సబ్ కమిటీ మార్గదర్శకాలు సిద్ధం
- పెట్టుబడి సాయం కోసం ఏడు ఎకరాల సీలింగ్ విధించే అవకాశం
- ఎన్ఆర్ఎస్‌సీ సహకారంతో సాగు భూముల శాటిలైట్ సర్వే
- క్షేత్ర స్థాయిలో సహాయ వ్యవసాయ అధికారులతో నిర్ధారణ
- ఐటీ చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులకు పెట్టుబడి సాయం కట్?
- పీఎం కిసాన్ సమ్మాన్ నిధిలోని కొన్ని మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకోనున్న ప్రభుత్వం
- ఈ నెల 30న జరిగే కేబినెట్ భేటీలో ఆమోదం తెలిపే చాన్స్.. సంక్రాంతి నుంచి అమలు

హైదరాబాద్: రాష్ట్రంలో సాగులో ఉన్న భూములకు మాత్రమే పెట్టుబడి సాయం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన భూమిని శాస్త్రీయ పద్ధతిలో లెక్కగట్టి తదనుగుణంగా 'రైతు భరోసా' మొత్తాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయనుంది.






# సీఎం రేవంత్‌రెడ్డితో సినీ ప్రముఖుల భేటీపై దిల్ రాజు ప్రకటన

(మొదటి పేజీ తరువాయి)

చికిత్స పొందుతున్న శ్రీతేజను పరామర్శించిన అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. సంధ్య థియేటర్ ఘటన తర్వాత చిత్రపరిశ్రమలో తీవ్ర అలజడి నెలకొంది. అయితే, సంక్రాంతికి భారీ బడ్జెట్ సినిమాలు వస్తున్న నేపథ్యంలో సీఎంతో చిత్ర పరిశ్రమ ప్రముఖులు కలవనున్నారు. సంధ్య థియేటర్ ఘటనతో బెనిఫిట్ షోలు, టికెట్ల ధరలు పెంచడం వంటివి ఉండవని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పిన విషయం తెలిసిందే. దీంతో చిత్ర పరిశ్రమలోని పలువురు ప్రముఖులు ఇదే అంశం గురించి ప్రభుత్వంతో చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు గురువారం ఉదయం 10 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చిత్ర పరిశ్రమలోని ప్రముఖులతో పాటు తాను కూడా కలవనున్నట్లు దిల్ రాజు తెలిపారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్‌గా.. ఇండస్ట్రీ, ప్రభుత్వానికి మధ్య వారధిగా తాను ఉంటానని దిల్ రాజు అన్నారు. సంక్రాంతి రేసులో గేమ్ ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం వంటి భారీ సినిమాలు ఉన్నాయి.

# ఆడారి చేరికపై కూటమిలో చిచ్చు!

(మొదటి పేజీ తరువాయి)

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌ను బీజేపీలో చేర్చుకున్న వ్యవహారం కూటమి పార్టీల మధ్య చిచ్చు రేపుతోంది. ఆయన్ను చేర్చుకోవడంపై టీడీపీ సీనియర్ నేత, శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేరు పెట్టకుండా బహిరంగంగానే అసహనం వ్యక్తం చేశారు. ఆడారి ఇటీవలి వరకూ వైసీపీలో ఉన్నారు. ఆ పార్టీ తరఫున విశాఖ పశ్చిమ అసెంబ్లీ స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక విశాఖ డెయిరీలో ఆర్థిక అవకతవకలపై పలు ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. శాసనసభలోనూ చర్చ జరిగింది. ఈ ఫిర్యాదులపై విచారణకు సభాసంఘాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అధ్యక్షతన ఏర్పాటైన సభాసంఘం ఇటీవల విశాఖ వెళ్లి డెయిరీ అధికారులతో సమావేశమైంది. ఈ క్రమంలో ఆడారి అప్రమత్తమయ్యారు. వైసీపీలో కొనసాగితే విచారణ ఇంకా లోతుగా జరుగుతుందన్న అంచనాతో కూటమిలోని పార్టీల్లో చేరడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. టీడీపీ, జనసేనల్లో చేర్చుకోవడానికి ఆ పార్టీల నాయకత్వాలు సుముఖంగా లేకపోవడంతో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిని సంప్రదించినట్లు సమాచారం. ఆమె ఆమోదం తెలుపడంతో బుధవారం బీజేపీలో చేరిపోయారు. దీనిపై ఉమ్మడి విశాఖ జిల్లాలోని టీడీపీ, జనసేన నేతలు అనకాపల్లి బీజేపీ ఎంపీ సీఎం రమేశ్‌ను ప్రశ్నించినట్లు సమాచారం. 'నాకేమీ తెలియదు.చేరికకు ఒక రోజు ముందు పురందేశ్వరి నాకు ఫోన్ చేశారు. ఆడారిని నేర్చుకుంటున్నామని, ఆయన వచ్చి మిమ్మల్ని కలుస్తాడని చెప్పారు. నన్ను కలవాల్సిన అవసరం లేదని చెప్పాను. చేర్చుకోవాలని నిర్ణయం తీసుకున్నాకే నాకు చెప్పారు' అని ఆయన తెలియజేశారు. ఈ చేరికపై ఒకరోజు ముందు ఒక బహిరంగ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర అసహనం వ్యక్తంచేశారు.

# అంబేడ్కర్ కృషిని విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వాలు

(మొదటి పేజీ తరువాయి)

ఖజురహో: దేశంలో జల వనరుల అభివృద్ధికి డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చేసిన కృషిని కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. 21వ శతాబ్దంలో తగినన్ని జల వనరులతోపాటు వాటి నిర్వహణలో మెరుగ్గా ఉన్న దేశాలే ప్రగతి పథంలో ముందుకు సాగుతాయని స్పష్టంచేశారు. 21వ శతాబ్దంలో నీటి సంరక్షణే అతిపెద్ద సవాలు అని తేల్చిచెప్పారు. బుధవారం మధ్యప్రదేశ్‌లో కెన్%-%బెత్వా నదుల అనుసంధాన ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఖజురహోలో నిర్వహించిన సభలో ప్రసంగించారు. అంబేడ్కర్ అందించిన సేవలను కొనియాడారు. మన దేశంలో జల వనరుల బలోపేతానికి, నిర్వహణకు, డ్యామ్‌ల నిర్మాణానికి అంబేడ్కర్ దార్శనికత, దూరదృష్టి ఎంతగానో దోహదపడ్డాయని తెలిపారు. కేంద్ర జల సంఘం(సీడబ్ల్యూసీ) ఏర్పాటు వెనుక అంబేడ్కర్ కృషి ఉందన్నారు. అతిపెద్ద నదీ లోయ ప్రాజెక్టుల అభివృద్ధికి ఎంతగానో శ్రమించారని పేర్కొన్నారు. జల సంరక్షకుడు అంబేడ్కర్‌ను గత కాంగ్రెస్ ప్రభుత్వాలు ఏనాడూ పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. జల సంరక్షణ ప్రాధాన్యతను సైతం పక్కనపెట్టాయని విమర్శించారు. ఈ సందర్భంగా దివంగత ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి శతజయంతి సందర్భంగా ప్రత్యేక స్మారక పోస్టల్ స్టాంప్, రూ.100 నాణాన్ని మోదీ విడుదల చేశారు. అంతేకాకుండా దేశవ్యాప్తంగా 1,153 అటల్ గ్రామ్ సేవా సదనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.437 కోట్లతో ఈ సదనాలు నిర్మిస్తారు. నేడు సుపరిపాలన దినోత్సవం జరుపుకుంటున్నామని ప్రధానమంత్రి చెప్పారు. మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వా జిల్లాలో ఓంకారేశ్వర్ ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టును ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. నదుల అనుసంధానంలో భాగంగా దౌధన్ సాగునీటి ప్రాజెక్టుకు సైతం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సి.ఆర్.పాటిల్, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ కెన్%-%బెత్వా నదుల నీటిని నింపిన రెండు కలశాలను ప్రధాని మోదీకి అందజేశారు. రెండు నదుల అనుసంధాన ప్రాజెక్టు నమూనా(మోడల్)లో మోదీ ఈ నీటిని ధారగా పోశారు. ప్రాజెక్టు నిర్మాణాన్ని లాంఛనంగా ఆరంభించారు.

## జీవితాంతం అంబేడ్కర్‌ను అవమానించారు

ఆయనకు భారతరత్న ఇవ్వకపోగా, పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కనీసం చిత్రపటం కూడా ఏర్పాటు చేయకపోవడం చూస్తే కాంగ్రెస్‌కు అంబేడ్కర్ పట్ల ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఇందిరాగాంధీ సహా ఎంతోమందికి భారతరత్న ఇచ్చినా.. కాంగ్రెస్ అంబేడ్కర్‌కు ఇవ్వలేకపోయిందన్నారు. మాజీ ప్రధాని వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్‌ను రెండుసార్లు ఎన్నికల్లో కాంగ్రెస్ కావాలనే ఓడించిందని ఆరోపించారు. ఎన్డీయే హయాంలోనే అంబేడ్కర్‌కు భారతరత్న ఇచ్చామని గుర్తుచేశారు. ఏడాదిపాటు వాజ్‌పేయి శతజయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వాజ్‌పేయి జీవితం దేశానికి ఆదర్శమని, ఆయన ప్రసంగం వినడానికి దేశం నలుమూలల నుంచి వేలాదిమంది వచ్చేవారన్నారు.

కాంగ్రెస్ పార్టీకి అబద్ధాల్లో ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఎద్దేవా చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ 70 ఎంఎం సినిమా చూపించి ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. వాజ్‌పేయి అందరికీ స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. దేశభక్తి, అభివృద్ధి, చతుర్భుజి పేరిట జాతీయ రహదారుల నిర్మాణంతో దేశాన్ని ఒక ప్రాంతంతో మరో ప్రాంతాన్ని అనుసంధానించారన్నారు.


# సాగు రైతుకే 'భరోసా'!

రైతులు భూమిని సాగు చేశారో లేదో తెలుసుకునేందుకు ప్రతి సీజన్‌లో శాటిలైట్ సర్వే చేయాలని కూడా నిర్ణయించింది. ఇందుకోసం నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) సహకారాన్ని తీసుకోనుంది. అదే సమయంలో సహాయ వ్యవసాయ అధికారుల (ఏఏఓలు)తో క్షేత్రస్థాయిలో పంటల లెక్కలు సేకరించనుంది. ఎన్‌ఆర్‌ఎస్‌సీ సాంతికేతిక పరిజ్ఞానంతో ఏ రైతు ఎంత భూమిలో ఏ పంట సాగు చేశాడనే వివరాలను తీసుకుని.. ఏఏఓలు ఇచ్చే నివేదికలతో సరిపోల్చుకొని రైతు భరోసాను జమ చేయాలనే అభిప్రాయంతో ఉన్నట్టు తెలిసింది. తద్వారా సాగు చేసే భూమికే పెట్టుబడి సాయం అందించడంతోపాటు రైతులను వ్యవసాయం దిశగా ప్రోత్సహించినట్టు అవుతుందని భావిస్తున్నట్టు సమాచారం. దీని ప్రకారం రైతులకు ఖరీఫ్ (వానకాలం)లో వచ్చే పెట్టుబడి సాయానికి, రబీ (యాసంగి)లో అందే సాయానికి మధ్య కూడా తేడా ఉండే అవకాశం ఉంది. రాష్ట్రంలో రబీలో సాగు విస్తీర్ణం తక్కువగా ఉంటుండటమే దీనికి కారణం. రైతులకు ఆరేళ్లుగా అందుతున్న పెట్టుబడి సాయం 'రైతుబంధు' స్థానంలో... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న 'రైతు భరోసా' పథకానికి మార్గదర్శకాల రూపకల్పన దాదాపు పూర్తయింది. కొత్త సంవత్సరంలో సంక్రాంతి నుంచి రైతు భరోసా ఇవ్వాలని నిర్ణయించినట్టు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల శాసనసభలో ప్రకటించారు కూడా. ఈ నెల 30న జరిగే మంత్రివర్గ సమావేశంలో రైతు భరోసాకు ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 'రైతు భరోసా' అమలులో ప్రభుత్వం అనుసరించనున్న విధివిధానాలపై చర్చ జరుగుతోంది.

**ఏడెకరాల సీలింగ్?**

ఇక ఒక రైతుకు గరిష్ఠంగా ఎన్ని ఎకరాల వరకు రైతుభరోసా పెట్టుబడి సాయం ఇవ్వాలనే విషయంలో మంత్రివర్గ సమావేశంలో స్పష్టత రానుంది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులకు మాత్రమే కేంద్ర ప్రభుత్వ పెట్టుబడి సాయం అందుతున్న నేపథ్యంలో... రాష్ట్ర పథకంలోనూ భూమికి సీలింగ్ విధించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేసినట్లు సమాచారం. పదెకరాలలోపు భూమికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని తొలుత అభిప్రాయం వ్యక్తమైనా.. మధ్యే మార్గంగా ఏడెకరాల సీలింగ్‌ను అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. పీఎం కిసాన్ పథకంలో ఐదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతుకు పెట్టుబడి సాయం అందదు. రాష్ట్ర ప్రభుత్వం అలా కాకుండా ఎంత భూమి ఉన్నా గరిష్ఠంగా ఏడెకరాలకు రైతు భరోసా సాయం అందించాలని భావిస్తున్నట్టు సమాచారం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకంలో కుటుంబం యూనిట్‌గా తీసుకున్నారు. రైతు రుణమాఫీకి కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే విధానాన్ని అనుసరించి కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకుని.. ఒక కుటుంబం మొత్తానికి కలిపి రూ. 2లక్షల రుణమాఫీ చేసింది. ఇప్పుడు రైతు భరోసాకు కూడా కుటుంబాన్ని యూనిట్‌గా తీసుకోవాలని నిర్ణయించినట్టు సమాచారం. అంటే ఒక కుటుంబంలో ఎంత మంది పేర్ల మీద ఎంత భూమి ఉన్నప్పటికీ... ఆ కుటుంబం మొత్తానికి కలిపి ఏడెకరాలకే ప్రభుత్వ సాయం అందేలా విధి విధానాలు రూపొందించినట్టు తెలిసింది. ఇక గత ఐదేళ్లలో వరుసగా రెండేళ్లపాటు ఆదాయ పన్ను చెల్లించినవారు కుటుంబంలో ఒక్కరున్నా కూడా.. ఆ కుటుంబానికి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి వర్తించదు. ఈ విధానాన్ని రైతు భరోసాకు కూడా వర్తింపజేస్తే పెద్ద సంఖ్యలో అర్హులు తగ్గిపోయే అవకాశం ఉంటుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

# ప్రత్యేక సాయంతో ఆదుకోండి



(మొదటి పేజీ తరువాయి)

వచ్చే నెలలో మోదీ చేతుల మీదుగా రాష్ట్రంలో భారీగా తలపెట్టిన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరిపే ప్రాజెక్టులపై ఆయనతో చర్చించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం ప్రధానితో ఆయన నివాసంలో చంద్రబాబు భేటీ అయ్యారు. 45 నిమిషాలు ఇది సాగింది. రాష్ట్రప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలు, ఆర్థిక అంశాలపై చర్చించారు. ఇటీవల విడుదల చేసిన స్వర్ణాంధ్ర విజన్ 2047ను ప్రధానికి అందజేశారు. పోలవరం, అమరావతి పనులు మళ్లీ ప్రారంభించిన విషయాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పనులు వేగంగా సాగేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఏపీకి కీలకమైన రెండు ప్రాజెక్టులను గాడిన పెట్టడానికి ఆర్థిక సాయం చేసినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. 94 కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి గత ప్రభుత్వం నిధులు దారి మళ్లించిన విషయాన్ని.. దానివల్ల జరిగిన నష్టాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. 74 కేంద్ర పథకాలను పునరుద్ధరించినట్లు తెలిపారు. ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు అంశాన్ని ప్రధానికి వివరించిన సీఎం.. ఆ ప్రాజెక్టుకు అవసరమైన ముడి ఖనిజం సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. దీంతో పాటు ఈ సంస్థ ఏర్పాటుకు వివిధ శాఖలకు సంబంధించి అనుమతులు త్వరితగతిన వచ్చేలా చూడాలని విజ్ఞప్తిచేశారు. సాంకేతిక ఇబ్బందులు తొలగితే ప్రాజెక్టు వేగంగా పట్టాలు ఎక్కుతుందని. అందుకు సహకరించాలని అభ్యర్థించారు. అనంతరం కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు, వాటిని గాడిన పెట్టేందుకు తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. వివిధ శాఖలకు సంబంధించి కేంద్ర నిధుల విడుదలపై చర్చించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక సాయం చేయాలని కోరారు.

**పలువురు మంత్రులతో సమావేశం..**

ప్రధానితో భేటీకి ముందు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో తన అధికారిక నివాసంలో చంద్రబాబు సమావేశమయ్యారు. విశాఖ రైల్వే జోన్ పనుల శంకుస్థాపన, రాష్ట్రంలో చేపట్టిన, చేపట్టనున్న రైల్వే ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేసే అంశంపై చర్చించారు. అమరావతికి కొత్త రైల్వే లైన్ మంజూరు చేసినందుకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. అంతకుముందు ఉదయం మాజీ ప్రధాని వాజపేయి శత జయంతి కార్యక్రమంలో పాల్గొని నివాళులు అర్పించిన చంద్రబాబు.. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో జరిగిన ఎన్డీయే పక్షాల భేటీలో పాల్గొన్నారు. సమావేశనంతరం అమిత్‌షా, నడ్డాలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అక్కడే కేంద్ర ఉక్కు మంత్రి కుమారస్వామిని కలిసి విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలు, తదుపరి కార్యచరణపై చర్చించారు. సీఎం పర్యటనలో ఆయన వెంట కేంద్ర మంత్రులు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీపీ నేత లావు శ్రీకృష్ణ దేవరాయలు, రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఎంపీలు కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీభరత్ ఉన్నారు.

**కీలక ప్రాజెక్టులపై చర్చ**

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్రం అందించాల్సిన అత్యవసర సహకారం, రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టులపై ప్రధానితో సీఎం చర్చించినట్లు పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడు 'ఎక్స్'లో పేర్కొన్నారు. రైల్వేజోన్ స్థాపన, వాల్తేర్ రైల్వే డివిజన్ పురోగతి, ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే కనెక్టివిటీ, అభివృద్ధిని పెంచే లక్ష్యంతో కొత్త మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల వంటి కార్యక్రమాలపై రైల్వే మంత్రితో చర్చించారని తెలిపారు.

# ఆయన ఆదేశాలతోనే నిధుల మళ్లింపు


రేసుకు సంబంధించి నాటి ప్రభుత్వానికి, బ్రిటన్‌కు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈవో) సంస్థకు మధ్య జరిగిన ఒప్పందాలు, ఇన్‌వాయిసలు, 2023 సెప్టెంబరు 27న నాటి పురపాలకశాఖ ప్రత్యేక కార్యదర్శి అర్వింద్‌కుమార్ నాటి మంత్రి కేటీఆర్‌కు పంపిన ఫైల్ ప్రతులను ఏసీబీ అధికారులు తీసుకున్నారు. దానకిశోర్ ఫిర్యాదులో పేర్కొన్న ప్రతి అంశానికి సంబంధించిన ఆధారాలనూ సేకరించారు. మంగళవారం సాయంత్రం దాదాపు నాలుగు గంటల పాటు దానకిశోర్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం తమకు అందుబాటులో ఉన్న ఫైళ్ల ప్రకారం నిధుల మళ్లింపు అంతా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని.. దీనికి కర్త, కర్మ, క్రియ అంతా నాటి పురపాలక శాఖ మంత్రి కేటీఆరేనని దానకిషోర్ స్పష్టం చేసినట్లు సమాచారం. నోట్ ఫైల్ తర్వాత ఒప్పందం జరగడానికి నెలపైగానే సమయం పడితే, అంతకుముందే నిధులు విడుదల చేయడం పూర్తిగా నిబంధనల ఉల్లంఘనేనని, అనుమానాస్పద వ్యవహారమని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఎఫ్ఈవోకు, పురపాలక శాఖకు మధ్య గత ఏడాది అక్టోబరు 30న ఒప్పందం జరగ్గా.. అక్టోబరు3, 11వ తేదీల్లోనే ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి రూ.46 కోట్లను ఎఫ్ఈవోకు పంపడంపై ఏసీబీ అధికారులు స్పష్టత తీసుకున్నట్లు సమాచారం.

**సీఎసను పరిగణనలోకి తీసుకోకుండానే..**

ఏ శాఖకు సంబంధించి అయినా నాన్ బడ్జెట్ నిధులు వాడాలంటే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సమాచారం ఇచ్చి ఫైళ్లను ఆర్థిక శాఖకు పంపాల్సి ఉంటుందని, సీఎం లేదా సంబంధిత మంత్రి ఆమోదిస్తేనే ఇది సాధ్యం అవుతుందని, కేటీఆర్ ఆదేశాల మేరకే తాను నిధులను పంపానని అర్వింద్‌కుమార్ అంగీకరించిన విషయాన్ని దానకిశోర్ అధికారులకు చెప్పినట్లు తెలిసింది. అర్వింద్‌కుమార్ అప్పట్లో పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉండడంతో సీఎసని కూడా పరిగణనలోకి తీసుకోకుండా ఫైళ్లను నడిపించారని తెలుస్తోంది. గత ఏడాది జనవరిలో శాంతికుమారి సీఎసగా నియమితులైనప్పటికీ పురపాలకశాఖ ఫైళ్లు ఆమె వద్దకు రాకుండానే పరుగులు తీసేవని సమాచారం. ఈ క్రమంలో అర్వింద్‌కుమార్‌ను విచారించిన తర్వాతే కేటీఆర్‌కు నోటీసులు ఇవ్వాలని ఏసీబీ అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.ఒకటిరెండు రోజుల్లో అర్వింద్‌కుమార్‌కు నోటీసులు ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే హైకోర్టు కేటీఆర్‌కు ఇచ్చిన గడువు ఈ నెల 30నముగుస్తుండడంతో ఆ తర్వాతే నోటీసులకు వెళ్లాలా? అని కూడా ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

# జననేతకు నీరా'జనం'

కడప: వైఎస్సార్ జిల్లా పులివెందుల%-%తాతిరెడ్డిపల్లె మార్గంలోని పల్లెల జనమంతా బుధవారం రోడ్డుపైకి వచ్చేశారు.. జై జగన్ అంటూ నినాదాలు చేశారు.. తమ అభిమాన నాయకుడు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆ రహదారిలో వెళ్తున్నారని తెలుసుకుని ఆయా గ్రామాల వద్ద రోడ్డుపై తిష్ట వేశారు.. దారి పొడువునా జననేతకు బ్రహ్మరథం పట్టారు. వారి అభిమానానికి ముగ్ధుడైన వైఎస్ జగన్ సైతం ఏ ఒక్కరినీ నిరాశ పరచకుండా అందరినీ పలకరిస్తూ, సెల్ఫీలు దిగుతూ, అభివాదం చేస్తూ ముందుకు సాగారు. పులివెందుల సీఎస్ఐ చర్చిలో ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి క్రిస్మస్ ప్రార్థనల్లో పాల్గొన్న అనంతరం లింగాల మండలం తాతిరెడ్డిపల్లెలో రామాలయం విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొనేందుకు 11 గంటలకు బయలుదేరారు. అడుగడుగునా అభిమాన జనం పోటెత్తడంతో 30 కిలోమీటర్ల మేర ప్రయాణించేందుకు ఏకంగా ఆరు గంటలు పట్టింది. ప్రతి గ్రామం వద్ద రోడ్డుపైకి వచ్చిన ప్రజలు వైఎస్ జగన్‌ను చూసేందుకు ఎగబడ్డారు. ఆయనతో మాట్లాడటానికి, కరచాలనం చేయడానికి పోటీ పడ్డారు. సాయంత్రం ఐదు గంటలకు ఆలయం వద్దకు వచ్చే సరికి ఆ ప్రాంతం అంతా జనంతో కిక్కిరిసింది. వైఎస్ జగన్‌కు వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన కోదండరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విగ్రహ మూర్తులకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కాగా, ఈ ఆలయానికి వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.34 లక్షలు మంజూరు చేశారు. తాతిరెడ్డిపల్లెకు బయలు దేరిన మాజీ సీఎం వైఎస్ జగన్.. మార్గం మధ్యలో ఆయా గ్రామాల్లో నేతలందరినీ పేరు పేరునా పలకరిస్తూ ముందుకు సాగారు. ఈ క్రమంలో కర్నపాపాయపల్లెలో నాగశేషులరెడ్డి కన్పించలేదు. ఆయన గురించి వాకబు చేయడంతో అనారోగ్యంతో ఉన్నారని గ్రామస్తులు చెప్పారు. అప్పటికప్పుడు నాగశేషులరెడ్డి ఇంటికి వాహనాన్ని మళ్లించారు. ఆయన్ను పరామర్శించి, వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. లింగాలలో సీనియర్ నాయకుడు కొండారెడ్డి కన్పించక పోవడంతో వాహనం దిగి, ఆయన ఇంటి వద్దకు వెళ్లారు. ఆరోగ్య వివరాలు కనుక్కున్నారు. ఇలా ప్రతి గ్రామంలో నేతలను పేరు పేరునా పలకరిస్తూ ముందుకు కదిలారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ సతీష్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి, సినీ నటుడు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.








# సీఎం రేవంత్ కు ఘన స్వాగతం పలికిన నీలం మధు..

**ముఖ్యమంత్రి తో పాటు హాజరైన పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ గౌడ్,మంత్రులు దామోదర రాజ నరసింహ,కొండా సురేఖ,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి..**






**సంగారెడ్డి బ్యూరో డిసెంబర్ 25 (డైలీ రిపోర్ట్):** మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఏడుపాయల దుర్గా భవాని ఆలయంతో పాటు క్రిస్టమస్ సందర్భంగా మెదక్ చర్చి లో జరిగిన శతాబ్ది వేడుకల్లో పాల్గొనడానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టేడ్ క్యాండీడేట్ నీలం మధు ముదిరాజ్ ఘన స్వాగతం పలికారు. బేగంపేట నుంచి హెలికాప్టర్ ద్వారా ఏడుపాయల చేరుకున్న సీఎం రేవంత్ తో పాటు పీసీసీ,మంత్రులకు హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్చం అందించి గ్రాండ్ వెల్కమ్ చెప్పారు.అనంతరం ముఖ్యమంత్రి తో పాటు పీసీసీ మహేష్ గౌడ్,మంత్రులు దామోదర రాజనరసింహ,కొండా సురేఖ,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే రోహిత్, సంజీవ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మతరావు, టీజిఐఐసి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి,డీసీసీ ప్రెసిడెంట్ ఆంజనేయులు గౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి,గ్రంథాలయ చైర్మన్ సుహాసిని రెడ్డి,నియోజకవర్గ ఇంచార్జిలు రాజీ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,పూజల హరికృష్ణ గార్లతో కలిసి ఏడుపాయల వనదుర్గ అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకుని ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం వారితో కలిసి మెదక్ చర్చికి బయలుదేరి వెళ్లి చర్చి వంద సంవత్సరాల వేడుకతో పాటు క్రిస్టమస్ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ప్రజలు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు..

## శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో ఇంటలిజెన్స్ ఎస్పీ దయానంద్ ప్రత్యేక పూజలు

**శంకర్‌పల్లి సంబర్ 25:(డైలీ రిపోర్ట్):** శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప గ్రామ శివారులో గల 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో బుధవారం మాదాపూర్ ఇంటలిజెన్స్ ఎస్పీ దయానంద్ దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఎస్పి దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి, స్వామి వారి శేష వస్త్రంతో సన్మానించి, స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మరకత లింగేశ్వరుడుని దర్శించుకోవడం ఎంతో అనుభూతిని ఇచ్చిందన్నారు.




## దేశానికి భారత రాజ్యాంగమే రక్ష

### అణిచివేతలు అసమానతలే మను స్మృతి

### కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్




కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో "భారత రాజ్యాంగం- మనుస్మృతి" అనే అంశంపై చర్చ గోష్టి సంగారెడ్డి లోని సుందరయ్య భవన్ లో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి అశోక్ అధ్యక్షతన జరిగింది.. ఈ సందర్భంగా కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్ మాట్లాడుతూ దేశానికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన రాజ్యాంగమే రక్షా అని రాజ్యాంగం సకల సమస్యలకు పరిష్కారం చూపిందన్నారు. మధ్యయుగాలనాటి మను స్మృతి సమాజంపై అనేక ఆంక్షలు విధించిందని, వర్ణ వ్యవస్థ తీసుకొచ్చిందన్నారు. శూద్రులు పై మూడు వర్ణాలకు సేవ చేసేందుకే పుట్టారని వారిని విద్యకు దూరం చేసి ఎలాంటి హక్కులు లేకుండా చేశారని పేర్కొన్నారు. వృత్తుల ఆధారంగా కులాలను విభజించిందని మనస్మృతి ప్రకారం దేశం అసమానతలని ఎదుర్కొందని కుల వివక్ష అంటరానితనం ఉండటం తో ఎలాంటి అభివృద్ధి పురోగతి లేని సమజాన్నే మను స్మృతి కోరుకుంటుందాన్నారు. 75 సంవత్సరాల నుండి నిర్వీరామంగా ఈ దేశానికి దశ దిశగా చూపెట్టింది భారత రాజ్యాంగం మాత్రమేనని పేర్కొన్నారు. అలాంటి రాజ్యాంగాన్ని లేకుండా చేయాలని కుట్రలు చేస్తున్నారన్నారు. మనువాదుల కుట్రలను సాగనివ్వమని, రాజ్యాంగ పరి రక్షణ కోసం పోరాడుదామని అన్నారు. విద్య, వైద్యం ప్రభుత్వ రంగంలో ఉండే విదంగా పోరాడుదామని ప్రభుత్వ రంగాన్ని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల కోసం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం నర్సిములు, యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి. సాయిలు, కేజికేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రమేష్ గౌడ్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు మద్దూరు బాలరాజు, సామజిక ఉద్యమనాయకులు ఉదయ్ లు మాట్లాడరు కేవీపీఎస్ నాయకులు ప్రవీణ్, శ్రీకాంత్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**శేరిలింగంపల్లి, డైలీ రిపోర్ట్ :** ఆసియాలోనే గుర్తింపు పొందిన ప్రార్థన మందిరాల్లో కల్వరి టెంపుల్ లో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.క్రిస్మస్ వేడుకలకు మియాపూర్ లోని కల్వరి టెంపుల్ సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.ప్రతి సంవత్సరం క్రిస్మస్ వేడుకలను ఇక్కడ ఘనంగా నిర్వహిస్తారు. సుమారు లక్ష మందికి పైగా భక్తులు ప్రార్థనలో పాల్గొంటారని కల్వరి టెంపుల్ వర్గాలు తెలిపాయి.ఎటువంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ట్రాఫిక్ సిబ్బంది, లా అండ్ ఆర్డర్ సిబ్బంది అందుబాటులో ఉంటారని అధికారులు తెలిపారు. భక్తులు ఎక్కువ సంఖ్యలో వస్తుందడంతో నీళ్లు,భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు కల్వరీ టెంపుల్ నిర్వాహకులు తెలిపారు.నాలుగు ఆరాధనలు పొద్దున 6గంటలకు మొదలై సాయంత్రం 9వరకు కొనసాగుతూనే ఉంటాయని, బ్రదర్ సతీష్ కుమార్ సందేశం ఇస్తారని తెలిపారు..క్రిస్మస్ సందర్భంగా ప్రజల కోసం కల్వరి దేవాలయం లోపల బయట చాలా చిన్న దుకాణాలను ఏర్పాటు చేశారు.వాకిట్లో బొమ్మల దుకాణం,క్రిస్మస్ చిన్న బొమ్మలు,శాంటా క్లాజ్ దుస్తులు,గడియారాలు, బాబుల్స్,క్రిస్మస్ చిన్న గృహాలు అమ్ముతూ ఉండటం కనిపించింది.టెంపుల్లో లోపల పెద్ద బేకరీ,ఆహార దుకాణాలు,వివిధ స్టాల్స్ ఉన్నాయి. కల్వరి గుడి లోకి వెళ్ళాక అందరు కూర్చోవడానికి పర్మినెంట్ కుర్చీలు ఏర్పాటు చేశారు.





# నిజమైన సనాతన ధర్మం అదే: ఉపాసన

'మెగా పవర్ స్టార్ రామ్ చరణ్' సతీమణి ఉపాసన తన జీవితానికి సంబంధించిన ఆసక్తికర విషయాలను తరచూ సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేస్తూ ఉంటారు. తాజాగా ఉపాసన సనాతన ధర్మాన్ని ఉద్దేశించి ఎక్స్ (ట్విటర్) వేదికగా ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ ను షేర్ చేసుకున్నారు. గౌరవ, మర్యాదలతో ఇతరులకు వైద్యం అందించడమే నిజమైన సనాతన ధర్మమని తన తాతయ్య తమకు చెప్పినట్లు ఉపాసన తన పోస్ట్ లో చెప్పుకొచ్చారు.కాగా తన పోస్టులో ఉపాసన ఏం చెప్పారంటే.. 'అవసరమైన వారికి సానుభూతి, గౌరవంతో వైద్యాన్ని అందించడమే నిజమైన సనాతన ధర్మం అని మాకు మాకు మా తాతయ్యగారు నేర్పించారు. ఆయన మాటల నుంచి స్ఫూర్తి పొందిన మేము.. అయోధ్య రామ మందిరం వద్ద అపోలో ఉచిత ఎమర్జెన్సీ కేర్ సెంటర్ ప్రారంభించడం జరిగింది. తిరుమల, శ్రీశైలం, కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లలో విజయవంతంగా ఈ సెంటర్లు ఏర్పాటు చేశాం. ఇప్పుడు రామ జన్మభూమిలో దీనిని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ విషయంలో మాకు సపోర్ట్ చేసిన ప్రతి ఒక్కరికి నా కృతజ్ఞతలు' అంటూ ఉపాసన తన పోస్ట్ లో అని పేర్కొన్నారు.




దర్శకధీరుడు రాజమౌళి %-% మహేష్ బాబు సినిమా ఎప్పుడు స్టార్ట్ అవుతుంది ? అంటూ మహేష్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. పైగా ఈ ప్రాజెక్ట్ ను హాలీవుడ్ స్థాయిలో నిర్మించబోతున్నారు. ఇదిలా ఉంటే.. ఈ ప్రాజెక్ట్ గురించి రోజుకో రూమర్ చక్కర్లు కొడుతూనే ఉంది. ముఖ్యంగా ఈ సినిమాలో నటించే హీరోయిన్ ఎవరనే విషయం పై ఇప్పటికే చాలా గాసిప్స్ వినిపించాయి. తాజాగా గ్లోబల్ స్టార్ హీరోయిన్ ప్రియాంక చోప్రాను మహేష్ సరసన తీసుకోబోతున్నారని టాక్ నడుస్తోంది. అలాగే మరో కథానాయికగా ఓ అందమైన మలేషియా నటిని కూడా ఎంపిక చేస్తారని టాక్. అన్నట్టు ఈ సినిమాలో 'థోర్' ఫేమ్ క్రిస్ హెమ్స్‌వర్త్‌తో పాటు మరికొందరు హాలీవుడ్ నటీమణులు కూడా నటిస్తారని వార్తలు వచ్చాయి. అయితే, ఈ వార్తల పై ఇప్పటివరకు టీం అఫీషియల్ గా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఏదిఏమైనా పాన్ ఇండియా మూవీ లవర్స్ ఎప్పుడెప్పుడా అని ఈ సినిమా కోసం చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కాగా దక్షిణాఫ్రికా నవలా రచయిత విల్బర్ స్మిత్ రాసిన పుస్తకాల ఆధారంగా ఈ సినిమా స్క్రిప్ట్ ను రాశారు. కాబట్టి, ఈ సినిమా ఓ అడ్వెంచర్ థ్రిల్లర్ గా ఉండబోతుంది.



# మహేష్ సరసన గ్లోబల్ స్టార్ హీరోయిన్ ?

# నువ్వు నాలో స్ఫూర్తిని నింపావు

## రానాకు సమంత బర్త్‌డే విషెస్



రానా దగ్గుబాటి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు ఆయనకు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇదే సమయంలో సినీ సెలబ్రిటీలు సైతం రానాకు విషెస్ తెలుపుతున్నారు. ఈ క్రమంలో స్టార్ నటి సమంత సైతం రానాకు ప్రత్యేకంగా బర్త్‌డే విషెస్ తెలియజేశారు. 'హ్యాపీ బర్త్ డే రానా. నువ్వు చేసే ప్రతి పనిలోనూ వంద శాతం ఫోకస్ పెడుతుంటావు. ఈ విషయంలో నీ నుంచి నేను ఎంతో స్ఫూర్తి పొందాను. నేను ఎప్పటికీ నీ అభిమానినే. దేవుడు ఆశీర్వాదులు నీకు ఎప్పుడూ ఉండాలి' అంటూ ఇన్‌స్టా వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. కాగా, రానా ప్రస్తుతం సరికొత్త టాక్ షోతో ప్రేక్షకులను అలరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 'నం1 యారి' అంటూ ఓటీటీలో సందడి చేసిన రానా.. ఇప్పుడు 'ది రానా దగ్గుబాటి షో' అనే పేరుతో అభిమానులను అలరిస్తున్నాడు. ఈ షో ప్రముఖ ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లో నవంబర్ 23 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది.



# ఇది ముమ్మాటికీ రాజకీయమే : పూనమ్ కపూర్

చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడం.. నాంపల్లి కోర్టు రిమాండ్ విధించడం.. హైకోర్టు మధ్యంతర బెయిల్‌ను మంజూరు చేయడం.. రాత్రంతా బన్నీ జైల్లోనే ఉండటం అందరికీ తెలిసిందే. శనివారం ఉదయమే బన్నీని జైలు నుంచి విడుదల చేశారు. ఇక సెలెబ్రిటీలు అయితే బన్నీకి అండగా నిలిచారు. టాలీవుడ్ మొత్తం కదిలివచ్చింది. అల్లు అర్జున్ కోసం బాలీవుడ్ స్టార్లు కూడా మాట్లాడి మద్దతు తెలిపారు. ఇక సోషల్ మీడియాలో బన్నీ అరెస్ట్ మీద భిన్న వాదనలు అయితే వినిపించాయి. స్టార్ అయితే ఏంటి? నేషనల్ అవార్డు విన్నర్ అయితే ఏంటి? చట్టం ముందు అందరూ సమానులే.. చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుంది అని కొందరు అన్నారు. ఇక రేవంత్ రెడ్డి కక్ష్య సాధింపు చర్యలు అంటూ ప్రతి పక్షాలు మండిపడ్డాయి. ఈ హడావిడిలో పూనమ్ కౌర్ కూడా కొన్ని సెటైర్లు వేసింది. అల్లు అర్జున్ ఫోటోలను షేర్ చేస్తూ.. నా ఫేవరేట్ హీరో అని చెప్పింది. ఇక తాజాగా మరో ట్వీట్ వేసింది. ఇందులో అధికారాన్ని దుర్వినియోగం చేయడమే రాజకీయం.. ఆ అధికారాన్ని ప్రజల అభివృద్ధికి వాడటమే నాయకత్వం అంటూ కౌంటర్ వేసింది. అంటే రేవంత్ రెడ్డి తన పవర్‌ను మిస్ యూజ్ చేస్తున్నాడని, రాజకీయాలు చేస్తున్నాడని పూనమ్ కౌర్ చెప్పకనే చెబుతూ కౌంటర్లు వేసింది. అల్లు అర్జున్ మాత్రం బయటకు వచ్చి మీడియాతో మాట్లాడుతూ.. చట్టపరిధిలో ఈ కేసు ఉందని, భారత న్యాయ వ్యవస్థ మీద తనకు పూర్తి నమ్మకం ఉందని, ఈ కేసు గురించి తాను బయట మాట్లాడను అని చెప్పేసి వెళ్లిపోయాడు. మరి నెక్ట్స్ బన్నీ ఎలాంటి స్టెప్ తీసుకుంటాడో చూడాలి.



# నా క్యారెక్టర్‌కు కనెక్ట్ అవుతున్నారు

సదన్, ప్రియాంకా ప్రసాద్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ప్రణయ గోదారి'. పీఎల్ విఘ్నేష్ దర్శకత్వంలోపారమళ్ళ లింగయ్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదలైంది. ఈ చిత్రం సక్సెస్‌మీట్‌లో పీఎల్ విఘ్నేష్ మాట్లాడుతూ%-% "మా సినిమా చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని చెప్పడం హ్యాపీగా ఉంది" అన్నారు. "ఈ సినిమాలో నాపాత్రకు ఆడియన్స్ కనెక్ట్ అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది" అన్నారు ప్రియాంకా ప్రసాద్. "ఈ సినిమాపాటలకు మంచి స్పందన లభిస్తోంది" అన్నారు సంగీత దర్శకుడు మార్కండేయ.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707